దివ్యాంగులకు ఉపకరణాలు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 24న ములుగు, 22న పస్రా, 23 ఏటూరు నాగారం, 25న కన్నాయిగూడెంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించింది. శారీరక వైకల్యం, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగుల అర్హతలు పరిశీలించి జిల్లాలో 467 మందిని అర్హులుగా గుర్తించారు. జాబితాను భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలింకో)కు అందజేశారు. కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగే ఈ సంస్థ ఉపకరణాలు సమకూరుస్తుంది. దివ్యాంగులకు బ్యాటరీతో పని చేసే ట్రై సైకిళ్లు, మూడు చక్రాల రిక్షా, వీల్ ఛైర్లు, చేతి కర్రలు, బధిరులకు శ్రవణ యంత్రాలు, అంధులకు చేతి కర్రలు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కిట్లను అందించనుంది. అలింకో సంస్థ ఏటా ఉచితంగా అందించే ఉపకరణాలు డిసెంబరులో పంపిణీ చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శిరీష 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: 'పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా పోలీసుల పని తీరు ఉండాలని, ఎఫ్ఐఆర్ నమోదుతో పాటు కేసుల దర్యాప్తు నిష్పక్షపాతంగా ఉండాలని' ఎస్పీ శబరీష్ అన్నారు. పస్రా ఠాణాను ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రిని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధిత వ్యక్తుల నుంచి ఫిర్యాదును స్వీకరించిన వెంటనే రసీదును ఇవ్వాలని, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సాక్ష్యాధారాలను సేకరించడంలో నైపుణ్యతను ప్రదర్శించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారి గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ అధికారికి తెలియజేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓఎస్డీ మహేశ్ బి.గీతే, డీఎస్పీ రవీందర్, సీఐ జి.రవీందర్, ఎస్సై ఎ.కమలాకర్, ప్రొబెషనరీ ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



పస్రా ఠాణాలో ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్

ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే రౌడీ షీట్లు తెరుస్తాం..

ములుగు టౌన్: విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసినా, విధులకు ఆటకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శబరీష్ అన్నారు. నిందితులను ఉపేక్షించేది లేదని, వారిపై రౌడీషీట్, పీడీ చట్టం వర్తింపచేస్తామని హెచ్చరించారు.

ఆకేరు పొడవునా.. ఇసుకాసురులదే ఇష్టారాజ్యం!



ఉమ్మడి వరంగల్‌లో సాగు, తాగునీటికి కీలకమైన ఆకేరు వాగు.. ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీ యంత్రాలు.. ఆరు ట్రాక్టర్లు అన్నచందంగా అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల మద్దతు.. మరికొన్ని చోట్ల పోలీసులు 'మామూలు'గా తీసుకుంటుండడంతో వారిని ఏం చేయలేని పరిస్థితి.. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల గుండా ప్రవహించే ఈ వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కడెక్కడ జరుగుతుందో పరిశీలించి 'ఈనాడు' ప్రత్యేక కథనం.

ఈనాడు, మహబూబాబాద్



రోజువారీ ఇసుక అక్రమ రవాణా ఇలా	
ట్రాక్టర్లు	350
ఒక ట్రాక్టర్‌లో రవాణా (క్యూబిక్ మీటర్లు):	3
మొత్తం తరలిస్తోంది (క్యూబిక్‌మీటర్లు):	1050
ఒక ట్రాక్టర్ ఇసుక ధర: రూ.	6000
అక్రమార్కులు పొందుతున్న ఆదాయం(రూ.లక్షలు)	21

నష్కల్ · ఉప్పుగల్లు · కూనూరు · నందనం · రాంనగర్ · వర్ధన్నపేట · ఇల్లంద · కొత్తపల్లి · ల్యాబర్తి · పర్వతగిరి · నెల్లికుదురు · జయపురం · చిన్న గూడూరు · ఉగ్గంపల్లి · ముల్కలపల్లి

120.6 కి.మీ. ప్రవాహం

జనగామ జిల్లా చిల్పూరు మండలం పైపాటు నుంచి ప్రారంభమయ్యే చిన్న ప్రవాహం నష్కల్ వద్ద ఆకేరు వాగుగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇది ఉమ్మడి వరంగల్ పరిధి 4 జిల్లాల్లోని 13 మండలాల్లో 46 గ్రామాల మీదుగా 120.6 కి.మీ. ప్రవహిస్తోంది. పరివాహకంలోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి దోహదపడుతోంది.



ఇల్లంద సమీపంలో

● జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ సమీపంలో వరద పెరగక ముందు 25 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తరలించేది. ఇప్పుడు వరద ప్రవాహం ఉన్నా 15 ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు.

● ఐనవోలు మండలం నందనం, రాంనగర్ ప్రాంతాల్లో తవ్వకాలకు నెల రోజులుగా చెక్ పడింది. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారుల అండదండలతోనే రవాణా జరిగేదనే ఆరోపణలున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వాగులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. సుమారు 100 ట్రాక్టర్లు ఇళ్లకే పరిమితమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రిపూట తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక రవాణా చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

● వర్ధన్నపేట మండలం ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి ప్రాంతంలోని వాగు నుంచి ప్రతి రోజు 250 ట్రాక్టర్ల ఇసుక నగరానికి తరలుతోంది. తెల్లవారుజామున 3 గంటలకు ఖమ్మం-వరంగల్ 563వ జాతీయ రహదారిపై దాదాపు 2 కి.మీ. పొడవునా ట్రాక్టర్ల వరుస కనిపిస్తుంది. తోడేందుకు జేసీబీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని సైతం వాహనంలో నింపి నీటితో మట్టిని వేరు చేస్తున్నారు.



ల్యాబర్తిలో జేసీబీ యంత్రం ద్వారా..



కొత్తపల్లిలో మట్టిని వేరు చేశాక..

● పర్వతగిరి మండలంలోని చెరువుముందుతండాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారుల నిఘాతో తవ్వకాలు నిలిచాయి. త్వరలోనే తవ్వకాలు చేసేందుకు అక్రమార్కులు అధికారులు తమని పట్టించుకోకుండా చూడాలని పేరున్న ప్రజాప్రతినిధిని కలవాలని సన్నద్ధమవుతున్నారు.

తవ్వకాలను అడ్డుకోవాలని చెప్పాం..

రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నాం. తవ్వకాలను అడ్డుకోవాలని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లకు చెప్పామని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పేర్కొన్నారు.

వాగు నుంచి చెరువుకు

జఫర్‌గఢ్ మండలం కోనాచలం ప్రాంతంలోని వాగు నుంచి వర్ధన్నపేట పెద్ద చెరువులోకి వరదనీరు వెళ్లేలా కట్టుకాలువ నిర్మించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రాంతంలోని మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా రాయపర్తి మండలం కొత్తూరులోని రెండు చెరువుల్లోకి, అక్కడి నుంచి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ చెరువులోకి వరదనీరు వెళ్తోంది. నెల్లికుదురు మండలం ఎర్రబెల్లి గూడెం వద్ద వాగుపై ఉన్న మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా నెల్లికుదురు పెద్ద చెరువులోకి ఆకేరు వరద ప్రవహిస్తుంది. అక్కడా అక్రమ రవాణా సాగుతోంది.



నెల్లికుదురులోని వాగులో నీటిలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగుతున్న మరో రెండు ట్రాక్టర్ ఇంజిన్లు



నర్సింహులపేట మండలం జయపురం, చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు, మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి, ఉల్లేపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లోంచి 50 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది.



● నెల్లికుదురు మండలం నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, మునీగలవీడు సమీపంలోని వాగుల్లోంచి ప్రతి రోజు 35 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది. వరదనీటిలోంచే ఇసుకను తవ్వి తరలిస్తున్నారు.

కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 45 కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 64 నమోదు చేసి 96 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 98 వాహనాలను పట్టుకుని కేసులు పెట్టకుండా మైనింగ్‌శాఖకు అప్పగించారు



మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద..

ఉద్యోగులపై దాడులు తగవు

ములుగు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ టీఎస్. దివాకర హెచ్చరించారు. తాడ్వాయి మండలం దామెరవాయి అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులపై జరిగిన దాడి సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాడ్వాయి మండలం దామెరవాయి అటవీ ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్రలపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడం అమానుషమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల భద్రతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సంఘటనపై పోలీసు అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారని, దాడి చేసిన వారిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆదివాసీ సంస్కృతి చాటి చెప్పేలా ముస్తాబు

తాడ్వాయి, న్యూస్‌టుడే: వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు కొలువుదీరిన మేడారాన్ని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాటి చెప్పేలా ముస్తాబు చేయనున్నట్లు పేసా జిల్లా సమన్వయకర్త కొమురం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనదేవతల గద్దెల ప్రాంగణంలో పూజారులు, కులపెద్దలు, యువకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కొద్ది రోజుల్లో ఆదివాసీ నృత్యం, కట్టు, బొట్టు, దేవతలు, ఆహారపు అలవాట్లకు సంబంధించిన ప్రతి విషయం మేడారానికి వచ్చిన పర్యాటకులకు తెలియజెప్పేలా ఏర్పాట్లు చేసేందుకు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా నిర్ణయం చేసిందన్నారు. గ్రామస్థులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, అభ్యుదయ యువజనసంఘం అధ్యక్షుడు సిద్దబోయిన బోజారావు, పూజారులు రాణా రమేష్, గిరిజన మ్యూజియం సహాయ క్యూరేటర్ కుర్సం రవి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులకు మోక్షం..!

ములుగు, న్యూస్‌టుడే: ములుగులోని జంగాలపల్లి జాతీయ రహదారి నుంచి బంజెరుపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం నుంచి అనుమతి లభించడంతో.. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాంత వాసుల కల నెరవేరనుంది.

పాలనాధికారి ప్రత్యేక చొరవ

బంజెరుపల్లి రహదారి నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాల ద్వారా తెలుసుకొని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. పనులు త్వరితగతిన చేపట్టి సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో 'న్యూస్‌టుడే' ప్రతినిధి కూడా గ్రామస్థులతో చర్చించి గ్రామసభ ఏర్పాటు చేసి తీర్మానం జరిగేలా కృషి చేశారు. సంతకాలు చేసి తీర్మానించిన నకళ్లను పంచాయతీ కార్యదర్శి ద్వారా సమర్పించారు.



గుంతలమయంగా బంజెరుపల్లి రోడ్డు

● సుమారు రూ.60 లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డుకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు విస్తృతంగా కసరత్తు చేశారు. గతంలో తారు రోడ్డుగా నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో తీవ్ర జాప్యం జరిగి నిధులు వెనక్కి వెళ్లాయి. అధికారులు మళ్లీ ప్రత్యేక చొరవ చూపి కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం కలిగిన ఈ మార్గాన్ని గతంలో తారు రోడ్డు వేయాలని నిర్ణయించినప్పటికీ. ఎక్కువ కాలం ఉండదని భావించిన అధికారులు దాన్ని సిమెంటు రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదించారు. గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్థులతో తీర్మానించి హైదరాబాద్‌లోని చీఫ్ ఇంజినీరుకు నివేదించగా, అక్కడి నుంచి అనుమతులు మంజూరయ్యాయి.

మూడేళ్ల కింద నిధులు

రహదారి కోసం మూడేళ్ల కింద ఐటీడీఏ షెడ్యూలు తెగల ప్రత్యేక అభివృద్ధి నిధుల గ్రాంటు నుంచి నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ బాధ్యతలను గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం చేపట్టగా, టెండరు సైతం నిర్వహించి ఓ గుత్తేదారుకు పనులు అప్పగించారు. రోడ్డుపై లేయర్ మెటల్ వేసి, కల్వర్టుల నిర్మాణం చేపట్టి గుత్తేదారు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే మండలంలోని చాలా గ్రామాలకు ఇది బైపాస్‌గా ఉపయోగపడుతుంది. జంగాలపల్లి, బంజెరుపల్లి, సోమ్లపల్లి, రాంనగర్, కాసిందేవిపేట, పంచోత్కులపల్లి, రాయినిగూడెం, కొత్తూరు, యాపలగడ్డ, పెగడపల్లి, సర్వాపురం, అంకన్నగూడెం గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరతాయి.

తారుకు బదులు సిమెంటు రోడ్డు

జంగాలపల్లి-బంజెరుపల్లి దారికి కొత్తగా రూ.60 లక్షలు మంజూరయ్యాయి. గతంలో తారు రోడ్డు నిర్మాణం చేయాలని నిర్ణయించినప్పటికీ.. తారు నాణ్యత ఎక్కువ కాలం ఉండదని భావించి, కొత్తగా సిమెంటు రోడ్డు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. గతంలో జరిగిన పనులను మినహాయించి కొత్త అంచనాలు తయారు చేశారు. టెండరు ప్రక్రియ నిర్వహించి గుత్తేదారును కూడా ఎంపిక చేశారు.

మూడు నెలల్లో పూర్తిచేస్తాం..

- వీరభద్రం, ఈఈ, గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం, ఐటీడీఏ



తారు రోడ్డు నుంచి సిమెంటు రోడ్డుగా నిర్మించేందుకు అంచనాలు తయారు చేసి హైదరాబాదులోని చీఫ్ ఇంజినీరు కార్యాలయానికి ప్రతిపాదించాం. రెండు రోజుల క్రితమే అనుమతులొచ్చాయి. ప్రతి రోజు ఏదో ఒక సమయంలో వర్షం పడుతున్నందున పనుల్లో జాప్యం జరిగింది. సామగ్రిని సమకూర్చుకోవాలని గుత్తేదారుకు సూచించాం. త్వరలోనే పనులు ప్రారంభించి మూడు నెలల్లోనే పూర్తి చేస్తాం.

అంతర పంటలతో లాభాలు

వెంకటాపురం, న్యూస్‌టుడే: మండలంలోని రాచపల్లి, పాత్రాపురం గ్రామాల్లో శుక్రవారం ఉద్యాన పంటలను నాబార్డు అధికారులు పరిశీలించారు. మాతోట పథకంలో భాగంగా చేపట్టిన మామిడి, జామ క్షేత్రాలను వరంగల్ క్లస్టర్‌కు చెందిన నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి తుంగ రవి పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. పంట క్షేత్రాల్లో అంతరపంటలను సేద్యం చేసి లాభాలు ఆర్జించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకం వెంకటాపురం మండలంలోని 11 గ్రామాల పరిధిలో ఆచరణలో ఉన్నట్లు వివరించారు.



రాచపల్లి వద్ద పంటలను పరిశీలిస్తున్న నాబార్డు జిల్లా అధికారులు

విహార యాత్రలకు అనుమతి

ములుగు, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు విహార యాత్రకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ములుగు జిల్లా నుంచి విహారయాత్రకు వెళ్లే విద్యార్థుల వాహనాలకు జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ ముఖ్యఅతిథిగా హాజరై ములుగులో జెండా ఊపి ప్రారంభించారు. వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్, ములుగు మండలం మదనపల్లిలోని కస్తూర్బా విద్యార్థులు విహార యాత్రకు వెళ్లిన వారిలో ఉన్నారు.

సరిహద్దులపై నిఘా నేత్రం

వెంకటాపురం(ములుగుజిల్లా), న్యూస్‌టుడే: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులపై పోలీసులు నిఘా నేత్రాన్ని సంధించారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు. సమీప భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని పూసుగుప్ప సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు కాల్పులు జరిపిన ఘటనతో అప్రమత్తమయ్యారు. వెంకటాపురం-భద్రాచలం ప్రధాన మార్గం రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఎదిరగుట్టల వద్ద సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావుల ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు తీవ్రతరం చేశారు.



ములుగు-భద్రాద్రికొత్తగూడెం సరిహద్దు ఎదిరగుట్టల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ కుమార్, ఎస్సై తిరుపతిరావు, పోలీసులు

ప్రత్యేక బృందాలతో తనిఖీ

అభయారణ్యాన్ని ఆధీనంలోకి తీసుకున్న నిఘావర్గాలు నిశితంగా శోధన చేపట్టినట్లు తెలుస్తోంది. కాల్పుల సంఘటనతో ఉన్నతాధికారులు సైతం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రత్యేక పోలీసు బలగాలతో పాటు డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశారు. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలను నిలిపి పరిశీలించారు. సీఆర్పీఎఫ్ జవాన్లు గస్తీ తిరిగారు. వెంకటాపురం, వాజేడు, చర్ల, దుమ్ముగూడెం, ఏటూరునాగారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మద్దేడు మార్గాల్లో వెళ్లే వాహనదారుల వివరాలను సేకరించారు.

హై అలర్ట్

ఓ వైపు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు ఆవిర్భావ ఉత్సవాలను జరిపేందుకు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. మరో వైపు ఏకంగా సీఆర్పీఎఫ్ క్యాంపుపైనే దాడికి తెగించడంతో పోలీసులు హై అలర్ట్ ప్రకటించినట్లు తెలుస్తోంది. నక్సల్స్ కదలికలు ఉండే ప్రాంతాలపై నిఘావర్గాలు సైతం డేగకన్ను వేశాయి. తీవ్ర మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన వెంకటాపురం సర్కిల్ పోలీసులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు భద్రతపై ప్రత్యేక సమాలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దండకారణ్యంలోకి ప్రత్యేక బలగాలను మోహరింప చేసి జల్లెడ పట్టే పనిలో నిమగ్నమయ్యారు.

లంచం అడిగారు.. అనిశాకు చిక్కారు!


జనగామ, న్యూస్‌టుడే: ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన జనగామ కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మాజీ సైనికుడు చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇదే మండలంలోని నెల్లుట్ల- లింగాలఘనపురం రహదారి పక్కన పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు తన భార్య పేరిట దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశిత రుసుము చెల్లించారు. ఆయనకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆర్అండ్‌బీ ఈఈ హుస్సేన్ రూ.14 వేలు డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఈఈ చిలుకపాటి హుస్సేన్‌కు రూ.12 వేలు, ఏటీవో రవీందర్‌కు రూ.2 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు.



పట్టుబడిన నగదుతో ఏటీవో రవీందర్, ఈఈ హుస్సేన్ (పసుపు రంగు చొక్కా)

జనగామ జిల్లా కలెక్టరేట్‌లో వరుసగా వెలుగులోకి వస్తున్న అవినీతి ఘటనలపై ప్రత్యేక కథనం

'పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?' 6లో..



ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లు ఈ రోడ్డు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా వెళ్తుంటే అడవిలో నుంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.

– ఈనాడు, హనుమకొండ

ఓరుగల్లుకు 'ఘన' స్వాగతం!



ఓరుగల్లు.. ఎటుచూసినా.. చారిత్రక ఆలయాలు, గొలుసుకట్టు చెరువులు కనిపిస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయిస్తంభాల ఆలయంతో పాటు ఇతర ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేల మంది పర్యాటకులు వస్తుంటారు. అతిథులను ఆహ్వానించేందుకు వరంగల్ జిల్లాకు నాలుగు దిక్కులా స్వాగత తోరణాలు నిర్మించనున్నారు. అందులో ఒకటి వరంగల్ బొల్లికుంటలో, రెండోది హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో రాంపూర్ వద్ద, మూడోది ఎల్కతుర్తి, నాలుగోది నర్సంపేట వద్ద.. ఇలా నలువైపులా స్మార్ట్ సిటీ నిధులతో ప్రత్యేక స్వాగత తోరణాలు నిర్మించేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. నిర్మాణాలు పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది. రోడ్డుకు ఇరువైపులా 8 భారీ స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై కాకతీయుల చరిత్ర, శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా బొల్లికుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణానికి సంబంధించిన భారీ స్తంభాలను చిత్రంలో చూడొచ్చు. – ఈనాడు, హనుమకొండ



బంతి పూలవనం.. బతుకమ్మ వేడుకలకు సిద్ధం!

బతుకమ్మ పండగ సమీపిస్తున్న వేళ.. ఓ రైతు వేసిన బంతిపూల తోట ఎరుపు, పసుపు రంగుల పువ్వులతో విరబూసింది. మహబూబాబాద్ మండలంలోని మాధవపురం-కురవి రహదారి వెంట వాహనదారులను ఈ తోట ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్, నెహ్రూసెంటర్

ఉలిక్కిపడిన అడవి..!

- సిబ్బందిపై దాడులతో ఆందోళన

వారు.. రేయింబవళ్లు అటవీ సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తారు. వారిపైనే దాడి జరగడం అటవీ రక్షణ ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి దామెరవాయిలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు అటవీ అధికారులపై కొందరు ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరైన పరిష్కారం దొరకడం లేదు.

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి



గాయాల పాలైన అటవీ సిబ్బంది

విధులు.. కత్తిమీద సాము..

ఓ వైపు కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు, పోడుదారులు, అటవీ జంతువులతో ప్రమాదాలు పొంచిఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వివాదంలో గొత్తికోయల చేతిలో శ్రీనివాసరావు అనే రేంజ్ అధికారి ప్రాణాలు పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

పోడు పేరుతో..

పోడు పేరుతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పలువురు అడవులను నరికి వేస్తున్నారు. పోడు పట్టాల సర్వే సమయంలో మూడు జిల్లాల్లో 16 ఘటనలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోడును అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారు.

ఆయుధాలపై నిర్ణయమెప్పుడో?

అటవీ అధికారులు అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్లతో ముప్పు పొంచి ఉంది. 1982కు ముందు అటవీ అధికారులకు తుపాకులు ఉండేవి. మావోయిస్టుల కదలికలతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా.. అది నెరవేరడం లేదు.

గతంలో సంఘటనలు

- 2022 నవంబర్ 9న ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామంలో పోడు జరుగుతుందని తెలిసి వెళ్లిన సెక్షన్, బీట్ అధికారులపై వేట కుక్కలతో దాడి చేయించారు.
- 2022 సెప్టెంబర్‌లో జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో పోడుభూముల్లో ట్రాక్టర్లతో దున్నుతుండగా.. అటవీ అధికారులు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డారు. ఇద్దరు అధికారులు గాయపడ్డారు.
- 2021 అక్టోబర్‌లో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం పందిపంపుల గ్రామంలో అటవీభూముల్లో సాగును అడ్డుకునే క్రమంలో అటవీ అధికారులపై పోడురైతులు కారంపొడి చల్లి, పెట్రోల్ పోశారు. మహిళా ఎఫ్‌ఆర్వోతో పాటు ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి.

ఆయుధాలు ఇవ్వడంపై త్వరలో నిర్ణయం



బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

మట్టెవాడ, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలు అందించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అటవీ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్ చంద్రలను శుక్రవారం పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. దాడులు చేసిన వారిపై పీడీ, హత్యాయత్నం, తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ములుగు ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి: - ప్రభాకర్, సీసీఎఫ్, కాళేశ్వరం జోన్

అకారణంగా విధులు నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రిలో చేర్పించాం. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అడవుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. అటవీ సంపదను కాపాడే సిబ్బందికి అండగా ఉండాలి.

పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?

- జనగామ కలెక్టరేట్‌కు అవినీతి మకిలి
- పది నెలల్లో రెండో అనిశా ఘటన

ఈనాడు, వరంగల్, జనగామ, న్యూస్‌టుడే

అది జిల్లా పాలనా కేంద్రం. కలెక్టర్‌తోపాటు అనేక శాఖల అధిపతులు విధుల్లో ఉంటారు. కొందరు అవినీతి అధికారుల ఆగడాలకు అక్కడ అడ్డు లేకుండా పోతోంది. ఎవరుంటే మాకేంటి? మేం ఏ పనికైనా లంచాలు వసూలు చేసి తీరుతాం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తమ శాఖ కార్యాలయాలనే అడ్డాగా మార్చారు. అదే జనగామ కలెక్టరేట్.

జనగామ జిల్లాలో గత మూడు మాసాల్లో నెలకొక అవినీతి అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. కొందరు ప్రజాపాలనకు వేదికగా, పౌర సేవా కేంద్రంగా ఉండాల్సిన జిల్లా సచివాలయానికీ అవినీతి మురికిని అంటిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులే లంచావతారమెత్తి సహోద్యోగులను అవినీతి కూపంలోకి దించుతున్నారు. జనగామ ఆర్‌అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుసేన్‌తో పాటు, సహాయ సాంకేతిక అధికారి రవీందర్‌లు శుక్రవారం అనిశా అధికారులకు చిక్కడం కలకలం రేపింది.

సైనికుడినీ వదలలేదు: జిల్లాలోని లింగాలఘనపురం మండలం బండ్లగూడేనికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి రెండు దశాబ్దాల పాటు సైన్యంలో దేశానికి సేవలు చేసి 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. పెట్రోలు బంకు స్థాపించేందుకు గతంలో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల తమ మండలంలో బంకు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దీనికి కావాల్సిన నిరభ్యంతర పత్రం కోసం ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో నెలరోజుల కిందట అర్జీ ఇచ్చారు. రూ.17 వేల లంచం ఇవ్వాలని ఈఈ హుసేన్ డిమాండ్ చేసి, బేరం అనంతరం రూ.14వేలకు ఒప్పుకున్నారు. అధికారుల తీరు నచ్చక ఆయన వరంగల్ అనిశా అధికారులను సంప్రదించారు.

సంవత్సరం	ఏసీబీ కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	12

వారం కిందట తప్పించుకున్నారు..

వారం కిందటే అనిశా అధికారులు వ్యూహాన్ని అమలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ రోజు ఈఈ లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం టార్గెట్ మిస్ కాలేదు. రూ.14 వేలు ఈఈకి ఇవ్వగా, అందులో నుంచి రూ.2వేలు ఏటీవో రవీందర్‌కు ఇవ్వాలన్న సూచన ప్రకారం ఆయనకు అందజేశారు. శనివారం ఏసీబీ వరంగల్ ప్రత్యేక కోర్టులో వీరిని హాజరు పర్చనున్నారు.



ఆర్‌అండ్‌బి అధికారుల అవినీతి వ్యవహారం.. పట్టివేతపై వివరాలు చెబుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



ఫిర్యాదుదారు చిర్ర సత్యపాల్‌రెడ్డి

మధ్యవర్తులతో వసూలు

- గత నవంబరు 20న జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత రూ.40 వేలు లంచం డిమాండ్ చేసి, సదరు డబ్బును తన కారు డ్రైవర్‌కు ఇవ్వమన్నారు. పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గత జనవరిలో జిల్లా సచివాలయంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, ఒప్పంద ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినా సంతృప్తి చెందక, మరో రూ.50వేలకు ఒత్తిడి తేగా సదరు ఉద్యోగిని అనిశాను ఆశ్రయించింది. లంచం తీసుకుంటూ వైద్యాధికారితో పాటు, జూనియర్ అసిస్టెంట్ అజహర్‌లు పట్టుబడ్డారు.

ఎక్కడ వీలైతే అక్కడ

రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి తాజా మాజీ సర్పంచి చేసిన పనులకు బిల్లు చెల్లించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు డబ్బు తీసుకుంటూ జులై నెలలో పట్టుబడ్డాడు. పాలకుర్తి మండల మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేసిన పనికి బిల్లు చెల్లించేందుకు మండల ప్రత్యేక అధికారి హోదాలో రూ.10వేల లంచం తీసుకుంటూ ఆ మండల ఇరిగేషన్ అధికారి గోపాల్ అనిశాకు చిక్కారు. పనిచేసే చోట కాకుండా నివాసం ఉన్న హనుమకొండ(నక్కలగుట్ట)లోని ఓ చోట లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

వారిద్దరిదీ ఒకే ఊరు

అవినీతి అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి. తమ పనుల కోసం లంచం డిమాండ్ చేసే వారి ఆటకట్టించాలనే తపన అవసరమంటున్నారు సామాజిక వేత్తలు. ఈఈ హుసేన్ ఆటకట్టించిన సత్యపాల్‌రెడ్డి, జనగామ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన చెట్టిపల్లి రాజు ఇద్దరిదీ బండ్లగూడెం గ్రామమే.

ఆ ఇంటి యజమానికి నోటీసులు



భవనాన్ని పరిశీలించి, పట్టాదారుతో మాట్లాడుతున్న అధికారులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇంటిని తహసీల్దార్ సదానందం, దేవాదుల ఎత్తిపోతల పథకం డీఈఈ ప్రశాంతి, ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పరిశీలించారు. 'చెరువులోనే భవనం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఇల్లు కట్టిన సర్వే నెంబరుతో పాటు పరిసరాల రైతుల పట్టా భూములను సోమవారం పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని చెప్పారు. ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ మహేందర్‌రెడ్డిలు ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు. పంచాయతీ నుంచి గానీ, కుడా నుంచి గాని ఏవిధమైన అనుమతి లేకుండా ఇల్లు ఎలా నిర్మించారని, దీనికి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా నిర్ధారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, సర్వేయర్ సురేందర్, దేవాదుల ఎత్తిపోతల పథకం ఏఈఈ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆందోళన



హనుమకొండ డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమించడానికి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 274 మంది ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అర్హులైన అభ్యర్థులు హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కంగుతిన్నారు. ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులకు కనీసం సమాచారం అందించే వారేలేరని వాపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూసిన వారంతా అక్కడే ఆందోళన చేశారు. ఎంతో ఆశతో వస్తే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యాశాఖ అధిశాఖ సిబ్బంది అప్పటికప్పుడు ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒప్పంద పద్ధతిలో ఉద్యోగాలు చేసేందుకు అంగీకారం తెలిపిన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండ విద్యార్థి ఆత్మహత్య



భుక్య అక్షిత్ (పాతచిత్రం)

ఈనాడు, వరంగల్ : అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండకు చెందిన విద్యార్థి భుక్య అక్షిత్ (24) గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన అక్కడ ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుజరాత్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 27 నుంచి ఐఐఎం క్యాంపస్‌లో రెడ్ బ్రిక్స్ సదస్సు (టీఆర్‌బీఎస్) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో అక్షిత్ కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. 25 మంది విద్యార్థులు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తుండగా అక్షిత్ అందులో ఒకరు. ఈ సదస్సుకు గౌతమ్ అదానీతోపాటు ప్రముఖ వ్యాపార దిగ్గజాలు హాజరై ప్రసంగించాల్సి ఉంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురైన అక్షిత్ వసతిగృహంలోని తన గదిలో నైలాన్ తాడును ఉపయోగించి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన రెడ్ బ్రిక్ సదస్సును ఐఐఎం రద్దు చేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. వస్త్రాపూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అక్షిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సోలా సివిల్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి శుక్రవారం ఉదయం అక్షిత్ తల్లిదండ్రులు అహ్మదాబాద్ చేరుకున్నారు. అక్షిత్ చదువుల్లో చాలా చురుకైన విద్యార్థి. భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఏడాదిపాటు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు. 2023లో ఐఐఎంలో సీటు రావడంతో ఎంబీఏ కోర్సులో చేరారు. అక్షిత్ ఆత్మహత్యకు ఒత్తిడే కారణమా మరేదైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

అవివాహితులకు సువర్ణావకాశం



నేడు, రేపు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి. నెట్ మేరు/దర్జి కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు శనివారం(సెప్టెంబరు 28), ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లుకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 837444 5190, 800800 2165లో సంప్రదించవచ్చు.

3న ఎంఏ తెలుగు ప్రవేశ పరీక్ష

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు అక్టోబరు 3న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఆచార్య బి.బాబురావు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసిన వారు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్లో wwwpstu-cet.org వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉంటుందని, సకాలంలో హాజరు కావాలని అన్నారు.

శరన్నవరాత్రులకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం



రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 13 వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు ఆహ్వాన పత్రిక అందజేశారు. నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలు, బ్రోచర్లను శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..!



విద్యుత్తు నియంత్రిక కనిపించకుండా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. లైన్లలో మరమ్మతులు, నిర్వహణ పేరుతో కరెంటు సరఫరాను నిలిపివేసే అధికారులు, సిబ్బంది స్తంభాలను అల్లుకున్న తీగలను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాజేడు మండలంలోని జాతీయరహదారి పక్కనే ఇసుక వాగు సమీపంలో 11 కేవీ విద్యుత్తు లైనులో స్తంభాలను పిచ్చిమొక్కలు కప్పేశాయి. ఈదురుగాలులకు అప్పుడప్పుడు సరఫరా ఆగిపోతుందని, అల్లుకున్న తీగలను తొలగించాలని విద్యుత్తు సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా తొలగించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, వాజేడు(ములుగుజిల్లా)

దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో తెలుగు బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుడిని నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు వి.రామచందర్‌రావు పేర్కొన్నారు. పీజీటీ తెలుగు బోధించే అభ్యర్థులు ఎంఏ తెలుగు, బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ వరకు బోధించిన అనుభవం ఉండాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 30న బోధన పరీక్షతో పాటు ముఖాముఖీ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.

అప్రోచ్ మార్గానికి మోక్షమెప్పుడో..?

కన్నాయిగూడెం మండలంలోని సర్వాయి గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి బుట్టాయిగూడెం మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం మట్టి దారి ఉంది. వర్షం పడితే ఈ మార్గమంతా చిత్తడిగా మారి నడవలేని పరిస్థితి నెలకొంటుంది. బుట్టాయిగూడెం శివారు వరకు తారు రహదారి ఉంది. రెండేళ్ల క్రితం సర్వాయి వారధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. వర్షాకాలంలో సర్వాయి వాగు దాటడానికి పడే ఇబ్బందులు తప్పించారు. వంతెన వద్ద నుంచి బుట్టాయిగూడెం వరకు మాత్రం సరైన దారి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో ఐలాపూర్ గ్రామానికి వెళ్లాలంటే సర్వాయి మీదుగానే వెళ్లాల్సి వస్తుందని, అధికారులు స్పందించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



– న్యూస్‌టుడే, కన్నాయిగూడెం

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: పస్రా గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి సమీపంలో చెత్త పోగు పడి ఉంటుంది. దుర్వాసన వస్తోంది. **- పాడియా తులసీరాం, ఉపాధ్యాయుడు, పస్రా**

సమాధానం: రెండు రోజుల్లో చెత్తను తొలగింపజేస్తాం. **- శ్వేత, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, పస్రా**

నీటి వృథాకు అడ్డుకట్ట



కన్నాయిగూడెం: మండలంలోని సింగారం గ్రామంలో నల్లా లీకేజీతో తాగునీరు వృథాగా పోతున్న సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి తమ సిబ్బందిని పంపించడంతో.. నీటి వృథాను అరికట్టారు.

రహదారి శుభ్రం

స్పందనకు వందనం

కన్నాయిగూడెం: మండలంలోని సర్వాయిలో రహదారిలో చెత్తాచెదారం పేరుకుపోయిందనే సమస్యను కాలనీవాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు వివరించారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి మనోజ్ చెప్పగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా చేశారు.

పైపులైనుకు మరమ్మతు



మంగపేట: మండలంలోని పూరేడుపల్లి పాతూరులో పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతుందని సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి సుధారాణికి విషయాన్ని వివరించడంతో స్పందించారు. పంచాయతీ సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతు చేయించారు.

తీరిన తాగు నీటి సమస్య



మంగపేట: మంగపేటలోని టీచర్స్ కాలనీ సమీపంలో గత నాలుగు రోజుల క్రితం పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోవడంతో పాటు మురుగునీరు వస్తుందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు వివరించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు చెప్పగా, ఆయన స్పందించారు. పంచాయతీ సిబ్బందితో మరమ్మతు చేయించి లీకేజిని అరికట్టారు.

పూడిక తొలగింపు



వెంకటాపురం: వెంకటాపురం పంచాయతీలోని సున్నంబట్టివీధిలో డ్రైనేజీని కార్మికులు శుభ్రం చేశారు. 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా స్థానికులు సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి కార్మికులను అప్రమత్తం చేసి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

వీధి దీపాల ఏర్పాటు



వాజేడు: మండల పరిధి అరుణాచలపురం గ్రామంలో వీధిదీపాలు వెలగకపోవడంతో.. ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకుతోడుగా'కు చెప్పారు. విషయాన్ని పంచాయతీ ప్రత్యేకాధికారి అర్షద్ అహ్మద్, కార్యదర్శి కార్తీక్‌కు వివరించడంతో వారు స్పందించారు. గ్రామంలో సిబ్బందిచేత వీధిదీపాలను ఏర్పాటు చేయించారు.

'యాజమాన్యంతో ఐకాస నాయకులు కుమ్మక్కయ్యారు..'

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: కార్మికుల శ్రమను దోచుకొని బిల్టు యాజమాన్యం, ఐకాస నాయకులు కుమ్మక్కయారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను అర్ధాంతరంగా బయటకు పంపారని, రావాల్సిన వేతనాలు, గ్రాడ్యుటీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కమలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికులు మాట్లాడారు. ప్రతి రోజు గేటు వద్దకు వచ్చి సంతకాలు చేస్తేనే వేతనాలు ఇస్తామని నమ్మబలికారని, ఐదేళ్లుగా ఎటూ వెళ్లకుండా ఉన్నామన్నారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షలు రావాల్సి ఉండగా, కేవలం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖాతాలో జమ చేసి మోసం చేశారన్నారు. యాజమాన్యంతో ఐకాస నాయకులు కుమ్మక్కై చివరిసారి ఒప్పందాలపై సంతకాలు చేసిన తర్వాత ఎందుకు సమావేశం నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కార్మికుల డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఐకాస నాయకులు, యాజమాన్యంపై కేసులు పెడతామని హెచ్చరించారు. కార్మికులు బీమ్‌రావ్, తేజమ్మ, జానకిరామ్, చిరంజీవులు, పల్లి రామారావు, బత్తుల ఉప్పలయ్య, జి.వాసు పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగులపై దాడి హేయమైన చర్య

వెంకటాపురం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ ఉద్యోగులపై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహామూర్తి అన్నారు. తాడ్వాయి మండలంలోని దామరవాయి అటవీ ప్రాంతంలో ఇరువురు అటవీ ఉద్యోగులపై గిరిజనేతరుడు దాడికి పాల్పడటాన్ని శుక్రవారం తీవ్రంగా ఖండించారు. అటవీ భూమిని ఆక్రమణకు ప్రయత్నిస్తూ.. ఉద్యోగులపైనే దాడికి దిగిన బాధ్యుడిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇక్కడి కబ్జాకు ప్రయత్నించిన వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించినా.. రెవెన్యూ అధికారులు చోద్యం చూశారన్నారు. వలస గిరిజనేతరుల వైఖరితోనే ఆదవాసీలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వలస నిరోధక చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని కోరారు.

సూరజ్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలి

తాడ్వాయి: అటవీ అధికారులపై దాడిచేసిన జేసీబీ యజమాని గంట సూరజ్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ప్రభుత్వం స్పందించి సూరజ్‌రెడ్డిపై హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

ఏటూరునాగారం: నిందితులను కఠినంగా శిక్షించాలని ఐటీడీఏ ఆదివాసీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఆలూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి పెనక కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. అధికారులపై దాడులు చేయడం సరికాదన్నారు. కాక భాస్కర్, లక్ష్మీనారాయణ, రమేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఐకాస ధర్నా వాయిదా



నినాదాలు చేస్తున్న ఐకాస నేతలు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన నిరవధిక ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం కొమురంభీం విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు 30:70 నిష్పత్తిలో పదోన్నతులు కల్పించాలని, బదిలీ అయిన ఏకోపాధ్యాయులను విడుదల చేయాలని కోరగా.. పీవో అందుకు అంగీకరించారన్నారు. బదిలీల్లో కొన్ని పోస్టుల ఖాళీలను ప్రదర్శించకపోవడంతో సీనియర్లకు నష్టం జరిగినందున సరిచేస్తానని హామీ ఇవ్వడంతో ఈ ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మంగపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ అధికారి భద్రూనాయక్ ఆధ్వర్యంలో కళాశాల ప్రధానాచార్యులు నాయిని వీరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, అధ్యాపకులు రజిత, సంతోష్‌కుమార్, రవీంద్రనాయక్, లక్ష్మణ, శ్రీనివాస్, చిరంజీవి, వందన, తదితరులున్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టొద్దని మాలల ఐక్య వేదిక జిల్లా సంధాత గంపల శివకుమార్ అన్నారు. ఏటూరునాగారం పట్టణంలో శుక్రవారం మాలల ఐక్యవేదిక నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్ధన్నపేట శాసనసభ్యుడు నాగరాజుపై ఎమ్మార్పీఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేసి అడ్డుకోవడం సరికాదన్నారు. వర్ధన్నపేట ఓట్ల తేడాను చూపిస్తూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రఘు, కరంచంద్ గాంధీ, వేల్పుల సమ్మక్క, రమేష్, రామకృష్ణ, హరికృష్ణ, మధు, రాంబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం

ములుగు, న్యూస్‌టుడే: దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 3 నుంచి ములుగులో ప్రారంభం కానున్న ఉత్సవాలకు ఉత్సవ కమిటీ శుక్రవారం ఏర్పాట్లు ప్రారంభించింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి ఏర్పాట్లను ప్రారంభించారు. ములుగులోని రామాలయం ప్రాంగణం చదునుతో పాటు అమ్మవారి స్టేజీ అలంకరణ, విద్యుత్తు దీపాలతో ప్రాంగణం అలంకరణ, ప్రతి రోజు పూజా కార్యక్రమాలు, నిత్యఅన్నదాన కార్యక్రమం, హోమం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు మోహన్ కుమార్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, ప్రశాంత్ రెడ్డి, చిన్న కొండారెడ్డి, రాజు, రాకేష్‌యాదవ్, రాకేష్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పాలనాధికారి దివాకర, బీసీ సంఘాల నాయకులు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యోద్యమం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, మూడు దశల ఉద్యమాల్లో పిడికిలెత్తి కీలకపాత్ర పోషించిన దేశ సేవకు అంకితమైన అలుపెరుగని వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలనాధికారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. బ్రిటీష్ కాలంలో ఎన్ని శిక్షలు వేసినా.. భయపడకుండా పోరాటంలో ముందుకు సాగారని, విద్యార్థి దశలోనే అనేక కష్టాలు వచ్చినా పోరాటంలో వెనకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్పనాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, పద్మశాలి కుల సంఘం నాయకులు జనార్దన్, రాజమల్లు, సారయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారంలోని ఆకులవారిఘణపురం గ్రామంలోని మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చాలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వికాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత పర్యావరణ పరిస్థితులపై వాటిని ఎదుర్కొనేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలేయాలంటూ నినాదాలు చేశారు. పచ్చదనం పెంచాలని, పారిశుద్ధ్యం చేపట్టాలని, విద్యుత్తుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ర్యాలీ చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఏటూరునాగారంలో ప్రధాన రహదారి మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది, రవీందర్, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, రాజన్న, రవి, తిరుపతి, రాజ్‌కుమార్, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు రాజు, రాములు, సరళ, వాణిశ్రీ, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు శశికుమార్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విష జ్వరంతో గురుకుల విద్యార్థి మృతి

ములుగు టౌన్, న్యూస్‌టుడే: విష జ్వరంతో విద్యార్థి మృతిచెందిన సంఘటన ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో జరిగింది. మృతుడి తండ్రి బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగూడెం మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన కోరం చరణ్(15) గురుకులంలో 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం తమకు గురుకులం నుంచి ఫోన్‌చేసి జ్వరంతో బాధ పడుతున్నాడని, ఇంటికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులు చెప్పారు. పాఠశాల నుంచి వెళ్లి ములుగు ప్రభుత్వ దవాఖానాకు తీసుకెళ్లగా శుక్రవారం ఉదయం విద్యార్థికి మూత్ర సమస్య వచ్చింది. మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించగా, ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందాడని వాపోయారు. వారం రోజుల నుంచి జ్వరం వస్తున్నా.. పట్టించుకోలేదని విద్యార్థి తండ్రి ఆరోపించాడు.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని, అతడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆదివాసీ విద్యార్థి ములుగు జిల్లా అధ్యక్షుడు దబ్బగట్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం, జిల్లా పాలనాధికారి, ఐటీడీఏ పీవో చర్యలు తీసుకోవాలన్నారు.

ఎనిమిది మోటార్లు చోరీ

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: మండలంలోని పస్రా గ్రామ సమీప గుండ్లవాగు పరివాహక ప్రాంతంలో గురువారం రాత్రి రైతులకు చెందిన ఎనిమిది విద్యుత్తు మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సుమారు రూ.2.40 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వర్దం చందర్ రాజు, సీహెచ్.సోమేశ్వర్, షేర్ అశోక్, తుక్కాని గాంధీ, కె.రాంరెడ్డి, కేస లింగస్వామి, వొలాద్రి నీరజమ్మ, తుక్కాని గాంధీ, పగిళ్ల జనార్దన్‌రెడ్డి తెలిపారు. పస్రా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. పొలాల వద్ద వేసుకున్న యూరియా బస్తాలు, క్రిమి సంహారక మందులు కూడా చోరీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న ఈ దొంగతనాలు చర్చనీయాంశంగా మారాయి.

నిందితుడికి రిమాండ్

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని ఏటూరుకు చెందిన ఎల్.రవికుమార్ ఈ నెల 24న కంతనపల్లి సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెందిన కేసులో నిందితుడు పుట్ట రమేష్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించామని ఎస్సై వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న మృతుడు రవికుమార్, నిందితుడు రమేష్ కంతనపల్లి శివారు భూమిలో రోటవేటర్‌తో దుక్కి దున్నుతుండగా దానిపై నిల్చున్న రవికుమార్ అదుపుతప్పి కింద పడి చనిపోయాడు. సాక్ష్యాధారాలు లేకుండా చేసే ప్రయత్నం చేయడంతో పాటు పోలీసులను తప్పుదోవ పట్టించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు కేసు దర్యాప్తు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: మండలం రామాంజాపూర్ శివారు చెంచుకాలనీ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం ఉదయం విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థినులకు గాయాలైనట్లు హాస్టల్ వార్డెన్ సమ్మయ్య తెలిపారు. 6 గంటల సమయంలో నాలుగో తరగతి విద్యార్థిని హాస్టల్‌లో కట్టిన దండెంపై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాకు తగిలింది. హాస్టల్ ఆవరణలోని స్తంభం నుంచి చెంచుకాలనీకి చెందిన మూడు ఇళ్లకు చెందిన విద్యుత్తు వైర్లున్నాయి. రాత్రి సమయంలో వచ్చిన ఈదురు గాలులకు ఒక వైరు తెగి పాఠశాల ప్రహరీ గోడపైనున్న కంచె వైరుపై పడింది. రోజు మాదిరిగానే ఉదయాన్నే విద్యార్థినులు బట్టలు ఆరేయడానికి చెట్టుకు కట్టిన దండెనికి ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతం సంభవించింది. చెట్టుకు కట్టిన దండెం వైర్లకు విద్యుత్తు సరఫరా జరగడంతో విద్యార్థిని ప్రమాదానికి గురైంది. గమనించని 8వ తరగతి విద్యార్థిని కూడా వైరుకు తాకడంతో.. స్వల్పంగా షాకుకు గురైంది. వెంటనే విద్యార్థినులను 108 వాహనంలో ములుగు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. 4వ తరగతి విద్యార్థిని రెండు చేతి వేళ్లకు, పెదాలపై గాయాలయ్యాయని, 8వ తరగతి విద్యార్థిని స్వల్పంగా గాయపడిందని, ప్రస్తుతం వారి ఆరోగ్యం క్షేమంగా ఉన్నట్లు వార్డెన్ తెలిపారు. గ్రామస్థులకు వెళ్లే విద్యుత్తు వైర్లను హాస్టల్ విద్యుత్తు స్తంభం నుంచి తొలగించాలని విద్యుత్తు శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు.

జ్వరబాధితులకు రక్తపరీక్ష..!



వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు కరవయ్యాయి. జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తున్న బాధితులకు ఇక్కడి రక్తపరీక్ష విభాగం వద్ద కనీసం కూర్చునేందుకు బల్లలు, కుర్చీలు లేకపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఓ వైపు అనారోగ్యంతో పాటు రక్తపరీక్ష నిర్ధారణకు నేలపైనే కూర్చుని నిరీక్షించాల్సిన దైన్యస్థితి నెలకొంది. ప్రతీ రోజూ ఈ అవస్థలు రోగులు పడుతున్నా.. అధికారులు కనీస పట్టింపు లేకపోవడంతో అసహనం వ్యక్తమవుతోంది.

– న్యూస్‌టుడే, వెంకటాపురం

సాయిబాబా ఆలయంలో జయంతి వేడుకలు



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారంలోని శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయంలో శుక్రవారం బాబా జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం అర్చకుడు యల్లాప్రగడ భాను ప్రకాష్ శర్మ బాబావారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి బాబావారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చు సతీష్, కోశాధికారి వెంకట్రావు తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కమిటీ నాయకులు గంజి రమేష్, బచ్చు సత్యనారాయణ, నర్సింహాచారి, మాధవ్, మైనర్ బాబు, దయాకర్, సుశీల, లలిత, స్వప్న, భక్తులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు భారాస అండ

మంగపేట, న్యూస్‌టుడే: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని ములుగు నియోజకవర్గ భారాస ఇన్‌ఛార్జి బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. చుంచుపల్లికి చెందిన భారాస కార్యకర్త బోడ శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. కమలాపురం గ్రామానికి చెందిన బందెల సాంబయ్య రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి కూడా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారాస సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యం కల్పించి, వారి కుటుంబాలకు భరోసానిస్తుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. భారాస మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, సహకార సంఘం ఛైర్మన్ తోట రమేశ్, ఆత్మ మాజీ ఛైర్మన్ రమణయ్య, నాయకులు మల్లారెడ్డి, రాజు యాదవ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏజెన్సీలో ఆదివాసీలకు అన్యాయం'

వెంకటాపురం, న్యూస్‌టుడే: గిరిజన చట్టాల అమలు కోరుతూ ఈ నెల 30వ తేదీన భద్రాచలం ఐటీడీఏ ఎదుట నిర్వహించ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి కోరారు. వెంకటాపురం మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 1/70 చట్టంతో పాటు ఎల్‌టీఆర్ ఇతర హక్కులు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంపై సర్వహక్కులు కలిగిన ఆదివాసీలు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న లంబాడా ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహర దీక్షలకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అక్రమ విద్యుత్తు వాడకంపై తనిఖీలు

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని కమలాపురం బిల్టు కర్మాగారంలో అక్రమ విద్యుత్తు వాడకంపై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామని విద్యుత్ శాఖ ఏఈ గుర్రాల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కమలాపురం బిల్టు కర్మాగారం ప్రధానగేటు సమీపంలో ఓ వ్యాపారి కమర్షియల్ విద్యుత్తు కనెక్షన్ నుంచి ఏడీఎం కార్యాలయానికి కరెంటు సరఫరా అవుతుందనే పక్కా సమాచారం మేరకు తనిఖీలు జరిపినట్లు తెలిపారు. సరఫరా ఆనవాళ్లు గుర్తించామని, వెంటనే వ్యాపారి కనెక్షన్‌ను తాత్కాలికంగా నిలిపి వేసి వివరణ ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. తనిఖీల కోసం బిల్టు కర్మాగారంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యుత్ శాఖ ఏఈ, సిబ్బందిని సెక్యూరిటీ అడ్డుకున్నట్లు సమాచారం.

రామప్పలో సాంస్కృతిక కార్యక్రమాలు



వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టూరిజం, దేవాదాయ, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

వాజేడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెద గొల్లగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వెంకటాపురం ఐసీడీఎస్ సీడీపీవో ముత్తమ్మ శుక్రవారం సందర్శించారు. పోషణమాసం సందర్భంగా కేంద్రంలోని చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, బరువు, పెరుగుదల గురించి టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. చిరుధాన్యాలతో అధిక పోషకాలుంటాయని గర్భిణులు ఎక్కువగా వీటిని తీసుకోవాలని సూచించారు. సీడీపీవోతో పాటు పర్యవేక్షకురాలు మనోరమ, ఏఎన్ఎం నాగేంద్రకుమారి, అంగన్‌వాడీ టీచర్ తదితరులు ఉన్నారు.

వడ్డెర సహకార సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని చల్వాయి గ్రామంలో వడ్డెర సహకార సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పనులు ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో వడ్డెర కుల సంఘం నాయకులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర సహకార సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తేళ్ల హరిప్రసాద్, సీహెచ్.ఉమాదేవి, నరేందర్‌రెడ్డి, వి.ప్రకాశ్, వొడ్డెర కుల సంఘం నాయకులు పి.సమ్మయ్య, ఎల్లయ్య, ఎస్.భిక్షపతి, పి.వెంకటేశ్ పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌వర్మకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య, చిత్రంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

కాంగ్రెస్‌లో చేరిక

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలానికి చెందిన జమిందారీ వంశీయుల మూడో తరం, న్యాయవాది ఎస్ఆర్ఆర్ఆర్ కిరణ్‌కుమార్ వర్మ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య సమక్షంలో చేరారు. ఈ మేరకు పార్టీ కండువా కప్పి కిరణ్‌కుమార్ వర్మను పార్టీలోకి ఆహ్వానించారు. ఈయనతో పాటు వెంకటాపురానికి చెందిన మంచెన నర్సింహారావు తదితరులు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కిరణ్‌కుమార్ వర్మ తెలిపారు.